సాక్షి
కామారెడ్డి
బుధవారం । 23 । ఏప్రిల్ । 2025



తిరిగి చేర్చుకోం

బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరినవారిని తిరిగి పార్టీలో చేర్చుకోబోమని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేర్కొన్నారు.

- 10లో ▸



అవగాహన పెంచుకోవాలి

చిన్నమల్లారెడ్డిలో మంగళవారం ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
43.6/23.9

వాతావరణం

ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం పొడిగా మారుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

మళ్లీ అట్టడుగునే..

- ఇంటర్ ఫస్టియర్‌లో 50.09 శాతం ఉత్తీర్ణత
- సెకండియర్‌లో 56.38 శాతం..
- ఫలితాల్లో బాలికలదే పైచేయి

కామారెడ్డి టౌన్: ఇంటర్ ఫలితాలలో జిల్లా విద్యార్థులు నిరాశ పరిచారు. దాదాపు సగం మందే ఉత్తీర్ణులయ్యారు. దీంతో ఫలితాల్లో కామారెడ్డి జిల్లా వరుసగా రెండో ఏడాదీ రాష్ట్రంలో అట్టడుగున ఉండిపోయింది. ఇంటర్మీయట్ బోర్డు మంగళవారం ఇంటర్ ఫలితాలను విడుదల చేసింది. ఫస్టియర్‌లో 50.09 శాతం, సెకండియర్‌లో 56.38 శాతం ఉత్తీర్ణులయ్యారు. షరా మామూలుగా ఫలితాల్లో ఈసారి కూడా బాలికలదే పైచేయిగా నిలిచింది.

ఫస్టియర్ ఫలితాలు..

జిల్లాలో 8,740 మంది ఫస్టియర్ పరీక్షలు రాయగా 4,378 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 50.09గా నమోదైంది. ఇందులో బాలురు 4,053మంది పరీక్షలు రాయగా 1,496 ఉత్తీర్ణులయ్యారు. 36.91 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికల్లో 4,687 మందికి 2,882 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 61.49గా ఉంది.

జనరల్ గ్రూప్స్‌లో 6,828 మంది పరీక్షలు రాయగా 3,343మంది(48.96 శాతం) పాసయ్యారు. వొకేషనల్ విభాగంలో 1,912 మందికిగాను 1,035 మంది(54.13 శాతం) పాసయ్యారు.

సెకండియర్ ఫలితాలు..

జిల్లాలో 7,722 మంది విద్యార్థులు సెకండియర్ పరీక్షలు రాయగా 4,354 మంది పాసయ్యారు. 56.38 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో బాలురు 3,580 మంది పరీక్షలు రాయగా 1,569 (43.83 శాతం) పాసయ్యారు. బాలికల్లో 4,141 మందికిగాను 2,785 (67.24 శాతం) ఉత్తీర్ణులయ్యారు. జనరల్ విభాగంలో 6,485 మంది పరీక్షలు రాయగా 3,562 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 54.93గా నమోదైంది. వొకేషనల్ విభాగంలో 1,237 మందికిగాను 792 మంది పాసయ్యారు. 64.03 శాతం ఉత్తీర్ణులయ్యారు.

ప్రభుత్వ కళాశాలలవారీగా ఇంటర్ ఫలితాల వివరాలు..

కళాశాల	సెకండియర్ విద్యార్థులు/ ఉత్తీర్ణత	ఫస్టియర్ విద్యార్థులు ఉత్తీర్ణత
కామారెడ్డి	236/100	305/132
సదాశివనగర్	212/14	69/03
భిక్కనూరు	85/23	34/05
బిచ్కుంద	199/50	233/60
జుక్కల్	92/45	68/09
ఎల్లారెడ్డి	115/27	104/05
బాన్సువాడ	161/79	165/59
పిట్లం	164/81	94/41
బాన్సువాడ(బాలికలు)	240/156	299/157
దోమకొండ	159/61	79/25
గాంధారి	106/25	53/09
మాచారెడ్డి	162/63	61/08
తాడ్వాయి	120/10	60/07
రామారెడ్డి	104/25	44/06
మద్నూర్	96/34	86/20
లింగంపేట	116/92	124/79
బీర్కూర్	50/38	57/38
నిజాంసాగర్	00/00	13/01
నాగిరెడ్డిపేట	01/00	45/00
బీబీపేట	29/01	00/00



వరుసగా రెండోసారి చివరి స్థానం..

ఇంటర్ ఫలితాల్లో జిల్లా వరుసగా రెండో ఏడాది కూడా చిట్టచివరి స్థానంలో నిలిచింది. 2023 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 13వ స్థానంలో ఉన్న జిల్లా.. 2024 సంవత్సరానికి వచ్చేసరికి 35 వ స్థానానికి పడిపోయింది. ఈసారి కూడా చివరిస్థానంలోనే నిలవడం గమనార్హం.

అందరూ ఫెయిల్

నాగిరెడ్డిపేట: ఈ ఏడాది నూతనంగా ప్రారంభమైన నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాలు నిరాశ పరిచాయి. 45 మంది మొదటి సంవత్సరం పరీక్షలు రాయగా అందరూ అనుత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరైన ఒక విద్యార్థి సైతం ఫెయిల్ అయ్యారు.

సివిల్స్ సాధిస్తా..



నాన్న వెంకట్‌రెడ్డి సింగిల్ విండో చైర్మన్‌గా ఉన్నారు. తల్లి అనురాధ గృహిణి. హైదరాబాద్‌లోని ఎస్ఎస్ఆర్ ఇంపెల్స్ కళాశాలలో చదివాను. ఎంపీసీ విభాగంలో 995 మార్కులు సాధించినందుకు ఆనందంగా ఉంది. సివిల్స్ సాధించాలన్నదే నా లక్ష్యం.

– వలకొండ చర్విత, ఎంపీసీ, అంతంపల్లి

సంతోషంగా ఉంది..



మా నాన్న చంద్రశేఖర్ పట్టణంలో చిన్న వ్యాపారం చేస్తుంటారు. అమ్మ రమ గృహిణి. మాది మధ్య తరగతి కుటుంబం. ఇంటర్‌లో 994 మార్కులు సాధించినందుకు సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా.

– డి.రచన, ఎంపీసీ సెకండియర్, సాందీపని కళాశాల, కామారెడ్డి

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



భిక్కనూరు మండలం కాచాపూర్ గ్రామం మాది. నాన్న శ్రీనివాస్‌గౌడ్ గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నారు. అమ్మ జ్యోతి గృహిణి. ఇంటర్‌లో 994 మార్కులు వచ్చాయి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడమే లక్ష్యం.

– పాలమాకుల నేహ, ఎంపీసీ సెకండియర్, సాందీపని కళాశాల, కామారెడ్డి

డాక్టర్ కావాలన్నది నా కల..



మాది సదాశివనగర్ మండలం ధర్మారావుపేట. నాన్న రాజేశ్వర్‌రెడ్డి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. అమ్మ నజీమా బేగం గృహిణి. బైపీసీలో 993 మార్కులు వచ్చాయి. డాక్టర్ కావాలన్నది నా కల.

– సాయి రిశ్వితారెడ్డి, బైపీసీ సెకండియర్, సాందీపని కళాశాల, కామారెడ్డి

ఐఐటీలో సీటు సాధిస్తా



మా నాన్న సిద్ది రాములు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ స్రవంతి గృహిణి. నాకు ఇంటర్ ఫస్టియర్‌లో 467 మార్కులు వచ్చాయి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మంచి మార్కులు సాధించా. ఐఐటీలో సాధించాలన్న లక్ష్యంతో చదువుతున్నా.

– కే. మాన్యశ్రీ, ఎంపీసీ ఫస్టియర్, సాందీపని కళాశాల, కామారెడ్డి

ఐఏఎస్ లక్ష్యంగా..



మాది గాంధారి మండలం లంబాడి గుర్జల్ తండా. నాన్న గాజీరాం, అమ్మ నీలావతి వ్యవసాయం చేస్తుంటారు. ఇంటర్ ఫస్టి యర్‌లో 485 మార్కులు వచ్చాయి. ఎంఈసీలో ఉమ్మడి జిల్లా టాపర్‌గా నిలిచినందుకు సంతోషంగా ఉంది. ఐఏఎస్ కావడమే లక్ష్యం.

– గోతి యువరాజ్, ఎంఈసీ ఫస్టియర్, విజన్ జూనియర్ కళాశాల, కామారెడ్డి

డాక్టర్‌నవుతా



మా నాన్న నవీన్‌కుమార్, అమ్మ సంధ్య ఇద్దరూ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్లుగా పని చేస్తున్నారు. వారిద్దరు నాకోసం చాలా కష్టపడ్డారు. నిత్యం నన్ను దగ్గరుండి చదివించారు. 994 మార్కులు వచ్చినందుకు ఆనందంగా ఉంది. డాక్టర్ కావలన్నది నా లక్ష్యం.

– పూర్వజ, బైపీసీ సెకండియర్, వీఆర్‌కే కళాశాల, కామారెడ్డి

న్యూస్‌రీల్

'సిల్వర్ జూబ్లీ వేడుకల్లో మంత్రి పాల్గొంటారు'



బాన్సువాడ : పట్టణంలోని ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను గురువారం నిర్వహించనున్నామని, ఇందులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొననున్నారని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డిగ్రీ కళాశాలలో సిల్వర్ జూబ్లీ వేడుకల కరపత్రాలను ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళాశాల ఏర్పాటు చేసినప్పటి నుంచి గత సంవత్సరం వరకు 13,050 మంది చదువుకున్నారని, ఇందులో సుమారు 10 వేల మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని, మూడు వేల మంది ప్రైవేటు రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులందరూ వచ్చి సిల్వర్ జూబ్లీ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్‌స్వామి, కాంగ్రెస్ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి తదితరులున్నారు.

'వక్ఫ్ సవరణ చట్టంపై అవగాహన కల్పించాలి'



నాగిరెడ్డిపేట: వక్ఫ్ సవరణ చట్టంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర హార్టికల్చర్ కన్వీనర్ గంగారెడ్డి పేర్కొన్నారు. ధర్మారెడ్డిలో మంగళవారం వక్ఫ్ సవరణ చట్టంపై కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టంపై కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలు తప్పుడు ప్రచారం ద్వారా అపోహలు సృష్టిస్తూ, శాంతిభద్రతల సమస్య తలెత్తేలా చేస్తున్నాయని ఆరోపించారు. నిరుపేద ముస్లింలకు న్యాయం చేసేందుకే కేంద్రప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం తీసుకువచ్చిందన్నారు. వాస్తవమేమిటో ప్రజలకు తెలిసేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు హన్మండ్లు, నరేందర్‌రెడ్డి, దేవిసింగ్, మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్‌గౌడ్, మల్లేశ్, విష్ణు, నాయకులు భాస్కర్ నాయక్, పోచయ్య, గణేష్ నాయక్, బాలు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఎన్ఏ వైస్ ప్రెసిడెంట్‌గా ఆరోగ్య లక్ష్మి



బాన్సువాడ రూరల్ : తెలంగాణ స్టేట్ నర్సింగ్ అసోసియేషన్(టీఎస్ఎన్ఏ) వైస్ ప్రెసిడెంట్‌గా బాన్సువాడ సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ పూదోట ఆరోగ్య లక్ష్మి ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన ఆరోగ్య లక్ష్మిని స్థానిక వైద్యులు, నర్సులు అభినందించారు.

ఫుట్‌బాల్ అండర్ -14 రాష్ట్ర జట్టుకు ఎంపిక



కామారెడ్డి టౌన్: ఈనెల 25 నుంచి మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన విద్యార్థిని ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. రామారెడ్డి మండలం అన్నారం గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అక్షయ అండర్-14 బాలికల విభాగంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైందని పేర్కొన్నారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అక్షయను డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ జగన్నాథం, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రయ్య తదితరులు అభినందించారు.



భిక్కనూరు సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

రైతులందరికి భూధార్ కార్డులిస్తాం

భిక్కనూరు/రామారెడ్డి : భూ భారతి చట్టం అమలులోకి వచ్చిన వెంటనే రైతులందరికీ భూధార్ యునిక్ కార్డులను పంపిణీ చేస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. మంగళవారం భిక్కనూరు రైతు వేదికలో, రామారెడ్డి రైతు వేదికలలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులలో ఆయన మాట్లాడారు. లింగంపేట మండలంలో పైలట్ ప్రాజెక్టుగా భూభారతిని అమలు చేస్తున్నామన్నారు. జూన్ రెండు నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ చట్టం అమలులోకి వస్తుందన్నారు. ర్యాగట్లపల్లికి చెందిన రైతు నరేందర్‌రెడ్డి, భిక్కనూరుకు చెందిన రైతు అందె దయాకర్‌రెడ్డి, తిప్పాపూర్‌కు చెందిన రైతు కుంట లింగారెడ్డి ధరణి పోర్టల్ ద్వారా రైతులు ఎదుర్కొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం కోసమే భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయసంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, ఆర్డీవో వీణ, భిక్కనూరు, రామారెడ్డి తహసీల్దార్లు శివప్రసాద్, ఉమాలత, ఎంపీడీవోలు రాజ్‌కిరణ్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, భిక్కనూరు డిప్యూటీ తహసీల్దార్ రోజా తదితరులు పాల్గొన్నారు.



రామారెడ్డి సదస్సులో పాల్గొన్న ప్రజలు

తూకాలు ప్రారంభించాలంటూ రైతుల ధర్నా

రామారెడ్డి: రెడ్డిపేట కొనుగోలు కేంద్రంలో తూకాలు ప్రారంభించకపోవడంతో రైతులు మంగళవారం కొంతసేపు రాస్తారోకోకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి వడ్లను తీసుకువచ్చి పదిహేను రోజులవుతున్నా కాంటాలు చేయడం లేదన్నారు. దీంతో కొనుగోలు కేంద్రం వద్ద వడ్ల కుప్పలు పేరుకుపోతున్నాయన్నారు. కొనుగోలు కేంద్రం వద్ద కనీస వసతులు కూడా లేవని, ఎండ వేడికి తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సౌకర్యాలు కల్పించాలని, వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని, లేకపోతే రోడ్ బ్లాక్ చేస్తామని డిమాండ్ చేశారు.



రెడ్డిపేట్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

డీఈఈ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: డీఈఈ సెట్ కోసం వచ్చేనెల 15 వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నిజామాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో సూచించారు. ప్రవేశాలకు సంబంధించి షెడ్యూల్ విడుదల అయ్యిందని, మే 17, 18 తేదీల్లో ఎడిట్ ఆప్షన్, 20 నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్, 25న ప్రవేశ పరీక్ష, జూన్ 6న ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. జూన్ 7వ తేదీ నుంచి 11 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 13 నుంచి 16 వరకు కళాశాలల ఎంపిక, 21 నుంచి 24 వరకు అలాట్ అయిన కళాశాలల్లో చేరిక ఉంటాయని వివరించారు.

'పిల్లల భద్రత కోసం కృషి చేయాలి'



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి క్రైం: చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా ఎంపికైన ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో పిల్లల భద్రత కోసం కృషి చేయాలని, లైంగిక దాడులు జరగకుండా చూడాలని అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా ప్రతి పాఠశాలకు ఒక చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌ను నియమించామన్నారు. పిల్లలపై ఎలాంటి లైంగిక దాడులు జరగకుండా చూడాలన్నారు. అవసరమైతే తప్పు చేసే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, డీసీపీవో స్రవంతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు ఇబ్బందులు కలగనీయొద్దు'

భిక్కనూరు : కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా సహకార అధికారి రామ్మోహన్ సూచించారు. మంగళవారం ఆయన అంతంపల్లి, పెద్దమల్లారెడ్డిలలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతంపల్లి కేంద్రం వద్ద రైతుల కోసం పందిళ్లు వేయడం, తాగునీటి సౌకర్యం కల్పించడంపై విండో సీఈవో శ్రీనివాస్‌ను అభినందించారు. వేగంగా కాంటాలు పూర్తి చేసి రైస్‌మిల్లులకు పంపించాలని సూచించారు. ఆయన వెంట క్లస్టర్ అధికారి రమేశ్, మానిటరింగ్ అధికారి నగేశ్, విండో చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, రాజాగౌడ్, సీఈవో శ్రీనివాస్ ఉన్నారు.



వడ్లను పరిశీలిస్తున్న డీసీవో రామ్మోహన్

పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

- భూభారతిని పకడ్బందీగా అమలు చేయాలి
- వీసీలో గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఎఫ్‌వో నిఖిత, అధికారులు

కామారెడ్డి క్రైం: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, తదితర అంశాలపై కలెక్టర్‌లతో సమీక్షించారు. ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చూడాలన్నారు. బలహీన వర్గాల వారికి ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేయడంకోసం అవసరమైన ఇసుకను అందుబాటులో ఉంచాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పనులు ప్రారంభించాలన్నారు. భూ భారతిని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణలో 25 శాతం రాయితీ గడువును మరోసారి పొడిగించబోమని పేర్కొన్నారు.

జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద లింగంపేట్ మండలంలో భూ భారతి అమలు చేస్తున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఈ మండలంలో 23 రెవెన్యూ గ్రామాలున్నాయని, ఇప్పటివరకు 8 గ్రామాల్లో సదస్సులు నిర్వహించామని పేర్కొన్నారు. భూ సమస్యలపై 810 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఎఫ్‌వో నికిత, ఆర్డీవోలు వీణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి

జిల్లాలో భూగర్భ జలాలను సంరక్షించడానికి అవసరమైన కట్టడాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఉన్న మూడు మున్సిపాలిటీలలో రాబోయే వానాకాలంలో తీసుకునే వర్షపు నీటి సంరక్షణ చర్యల కోసం వెంటనే సర్వే చేపట్టాలన్నారు. ఈ వేసవిలో భూగర్భ జలాల సంరక్షణకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని డీఆర్‌డీవో సురేందర్‌ను ఆదేశించారు. వాగులను గుర్తించి వాటిలో నీటి ప్రవాహానికి అడ్డుగా రాతి కట్టడాలను నిర్మించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. భూగర్భ జలాల సంరక్షణ కోసం ఫాంపాండ్స్, బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్, ఇంకుడు గుంతలు ఎక్కువగా నిర్మించాలన్నారు. వానాకాలంలో కురిసే ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్ నాయక్, జిల్లా భూగర్భజల అధికారి సతీశ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్‌లు రాజేందర్, శ్రీహరి, మహేష్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

సరైన పోషకాహారం తీసుకోవాలి

గర్భిణులు, బాలింతలు సరైన పోషకాహారం తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణా పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు లబ్ధిదారులతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లలో అంగన్‌వాడి టీచర్లు తయారు చేసిన మునగ ఆకు రసం, రాగి జావా, నువ్వుల లడ్లు తదితర పోషకాహారాలను రుచి చూసి వారిని అభినందించారు.



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

పార్టీ వదలి వెళ్లిన వారిని తిరిగి చేర్చుకోం

- రుణమాఫీ వందశాతం చేసినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా
- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్


భిక్కనూరులో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం/భిక్కనూరు : బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పదవులు పొంది అధికారం పోగానే కాంగ్రెస్‌లో చేరిన నేతలను తిరిగి ఎట్టి పరిస్థితుల్లో పార్టీలోకి చేర్చుకునే ప్రసక్తే లేదని మాజీ మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. భిక్కనూరు మండల కేంద్రంలో, కామారెడ్డి పట్టణ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేశామని కాంగ్రెస్‌నేతలు ప్రగల్భాలు పలుకుతున్నారని, వంద శాతం రుణమాఫీ జరిగినట్లు నిరూపిస్తే తన ముక్కును నేలకు రాస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నేతలను కన్నతల్లికి మోసం చేసిన వారిగానే పరిగణిస్తామన్నారు. ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కామారెడ్డి పట్టణంలో చలో వరంగల్ ఆటో స్టిక్కర్ లను ఆటోలకు ఆయన అతికించారు.

బీఆర్ఎస్ లో పలువురు యువకుల చేరిక..

జిల్లా కేంద్రానికి చెందిన 30 మంది యువకులు మంగళవారం కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు కుంభాల రవి, ప్రభాకర్ యాదవ్, క్రిష్ణాజీ రావు, పార్టీ అధికార ప్రతినిధి బల్వంత్ రావు, నాయకులు పిట్ల వేణు, లక్ష్మీ నారాయణ, స్వామి, గైని శ్రీనివాస్, హాఫిజ్ భాను ప్రసాద్, కాంగ్రెస్ నేతలు అత్తెల్లి శ్రీనివాస్, నాగార్తి భూంరెడ్డి, వంగేటి చిన్ననర్సరెడ్డి, అందే మహేందర్‌రెడ్డి, తుక్కి వేణు, పాలరాంచంద్రం, ద్యావర సాయిరెడ్డి, రవీందర్‌రెడ్డి, బస్వయ్య, ఎనుగు వెంకట్‌రెడ్డి, వలకొండ వెంకట్‌రెడ్డి, అంబల్ల మల్లేషం, తక్కళ్ళ రవీందర్‌రెడ్డి, అనంత్‌గౌడ్, ముచ్చర్ల రాజిరెడ్డి,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి


మెంగారంలో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్

లింగంపేట(ఎల్లారెడ్డి): రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో మన్నే ప్రభాకర్ సూచించారు. మంగళవారం లింగంపేట మండలంలోని మెంగారం, ఎల్లారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మెంగారంలో ఆయన మాట్లాడారు. భూభారతి పోర్టల్ ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన వెల్లడించారు. రెవెన్యూ, అటవీ శాఖ భూముల వివాదాలను ఇరు శాఖల అధికారులు కలిసి సంయుక్తంగా సర్వే చేసి పరిష్కరించనున్నట్లు తెలిపారు. మండలంలోని మెంగారం గ్రామంలో 321, 322 సర్వే నంబర్లలో 60 మంది రైతులకు చెందిన 185 ఎకరాలు పట్టాలు ఉన్నా ఆన్‌లైన్‌లో సర్కారు భూమిగా చూపిస్తున్నట్లు అధికారుల దృష్టికి తెచ్చినట్లు రైతులు తెలిపారు. అలాగే రెవెన్యూ, అటవీ శాఖ వివాదంలో మరి కొన్ని భూములు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఆర్ఐ కిరణ్, ఎఫ్ఆర్‌వో ఓంకార్, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలి


లబ్ధిదారులతో సమావేశం నిర్వహిస్తున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండలం అచ్చాయపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలెట్ గ్రామంగా ఎంపికైన అచ్చాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం 90మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు కేవలం 13మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారన్నారు. మిగతా లబ్ధిదారులు ఎందుకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించడం లేదని ఆయన ఆరా తీశారు. సమావేశంలో నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి పిచ్చయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అర్హులను గుర్తించాలి

దోమకొండ/ఎల్లారెడ్డిరూరల్/ నిజాంసాగర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అర్హులైన పేదలను గుర్తించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం దోమకొండ మండలం లింగుపల్లి గ్రామంలో లబ్ధిదారుల గుర్తింపుకు అధికారులు ఇంటింటికి తిరిగి గుర్తించారు. గ్రామంలో 12 మంది లబ్ధిదారులను గుర్తించాల్సి ఉండగా, 10 మంది ఇంటి నిర్మాణానికి ముందుకు వచ్చినట్లు ఎంపీడీవో వివరించారు. ఎల్లారెడ్డి మండలం అడివిలింగాల గ్రామంలో ఎంపీవో ప్రకాష్ ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకున్న వారికి సంబంధించిన వారి వివరాలను పరిశీలించారు.నిజాంసాగర్ మండలం మల్లూర్‌తండా గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను ఎంపీడీవో గంగాధర్ పరిశీలించారు. ఇందిరమ్మ గృహాలు మంజూరైన లబ్ధిదారుల ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణ పనులపై లబ్ధిదారులతో చర్చించారు. ఈకార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగ మేళాలో ఎంపికైన విద్యార్థులు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల టీఎస్‌కేసీ, లైఫ్ సైన్సెస్ విభాగాల ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ ఉద్యోగాల కోసం మంగళవారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, కిష్టయ్యలు మాట్లాడుతు.. అనేక కంపెనీలు నైపుణ్యాలు గల విద్యార్థుల కోసం సంప్రదిస్తున్నాయని, అందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లైఫ్ సైన్సెస్ అధ్యాపకులు దినకర్ చిన్న, జి.శ్రీనివాస్‌రావు, తిరుమల మల్సూర్, ఎంఎస్ఎన్ ఏజీఎం కే.మోహన్, సీనియర్ మేనేజర్ బ్రహ్మరెడ్డి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

దాతల సేవలు అభినందనీయం



కామారెడ్డి రూరల్: ప్రభుత్వ పాఠశాలలకు సేవలు అందించడం ఎంతో అభినందనీయమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 35వ వార్డు పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన 'దాతలకు సన్మానం' అనే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. పాఠశాలకు విరాళాలు అందించిన కాలనీవాసులైన దాతలు బి రాజేశ్వర్, ఇనుప గ్రిల్స్‌కు సహకరించిన మాజీ కౌన్సిలర్ పోలీసు క్రిష్ణాజిరావు,, పాఠశాలకు కలర్లు వేయించిన భోజన్నగారి రాజు పాటిల్, బిల్డర్ రాంబాబులను శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో దేవునిపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం గంగాకిషన్, పాఠశాల హెచ్‌ఎం శైలజ, ఉపాధ్యాయురాలు నిషాత్ సుల్తానా, స్రవంతి, మాధవి, పిల్లల తల్లిదండ్రులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి


సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్డీవో సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు ఏర్పాటు చేసి, నీడకోసం పచ్చని పందిర్లు వేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు వేగం పెంచి ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు.అలాగే మహిళా సంఘాల సభ్యులు పాఠశాలల యునిఫామ్స్ కుట్టే ప్రతీ విద్యార్థి కొలతలు తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. స్కూల్ యునిఫాం కుట్టే మహిళలకు మంచి ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీలు రాజిరెడ్డి, గంగరాజు, నజీర్, మేహర్, మన్సూర్, స్వప్న, శ్రావణ్, బాలయ్య, స్త్రీనిధి మేనేజర్ అమల, నరేందర్, రవి పాల్గొన్నారు.

భిక్కనూరు మండల క్రైస్తవ సంఘం కార్యవర్గం ఎన్నిక


భిక్కనూరు మండల క్రైస్తవ సంఘం కార్యవర్గం

భిక్కనూరు: మండల క్రైస్తవ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని అన్ని గ్రామలకు చెందిన క్రైస్తవుల ప్రతినిధులు బస్వాపూర్‌లో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కమలాకర్, ఉపాధ్యాక్షులుగా శాంతికుమార్, జోసెఫ్, ప్రధానకార్యదర్శిగా ఈ. కిషన్, హయకార్యదర్శిగా పి.సుధాకర్, కోషాధికారిగా ఎస్.డేవిడ్, సంయుక్త కార్యదర్శిగా కే.యాదగిరి. సలహదారులుగా ప్రశాంత్‌కుమార్, డేవిడ్‌లు ఎన్నికయ్యారు.

పాస్టర్ల కార్యవర్గం..

భిక్కనూరు మండలంలోని చర్చిల పాస్టర్లు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాన్సన్ ఉపాధ్యాక్షుడిగా జోసెఫ్, ప్రధానకార్యదర్శిగా ఎస్.స్వామి, సహాయకార్యదర్శిగా పాల్, కోశాధికారిగా జెమ్స్, కార్యవర్గసభ్యులుగా పరిశుద్ధ రావు, బాల్‌రాజులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన జాన్సన్ మాట్లాడుతూ చర్చిల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

జొన్న కొనుగోలు పరిమితి పెంపుపై హర్షం


అచ్చంపేట సొసైటీ ఆవరణలో సీఎం, తదితర చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మద్నూర్/నిజాంసాగర్ (జుక్కల్): రైతుల శ్రేయస్సు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో, నిజాంసాగర్ మండలం అచ్చంపేట సొసైటీ కార్యాలయం ఆవరణలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు, మంత్రి తుమ్మల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతు ప్రభుత్వ జొన్న కొనుగోలు పరిమితిని ఎకరాకు 8 క్వింటాళ్ల నుంచి 14 క్వింటాళ్ల వరకు పెంపుపై వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు దృష్టికి తీసుకువెళ్లి కృషి చేసిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ రాంపటేల్, సొసైటీ చైర్మన్ శీను పటేల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, అచ్చంపేట సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎస్ఐ ప్రభాకర్

బీబీపేట: ప్రతి గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలే ప్రాధాన్యమని ఎస్సై ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని మల్కాపూర్ గ్రామంలో శ్రీగాద స్వామి, కమ్మరి బ్రహ్మాచారిల ఆర్థిక సహాయంతో గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద కెమెరాలను బిగించారు. ప్రతి గ్రామంలో దాతలు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

చౌదరి చెరువు మరమ్మతులకు రూ.37లక్షలు మంజూరు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పొల్కంపేట చౌదరి చెరువు మరమ్మతులకు రూ. 37 లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయకర్త నాగరాజు తెలిపారు. చౌదరి చెరువు తూము గత నాలుగు సంవత్సరాల క్రితం భారీ వర్షానికి తెగిపోయి కొట్టుకుపోయినట్లు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ రైతులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.37 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి అశ్వక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అజయ్‌గౌడ్, శివ్వయ్య, శ్రీనివాస్, సంజీవరెడ్డి, కృష్ణమూర్తి, దాసరి శ్రీనివాస్, రమేశ్, సతీష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ.. కరుణించమ్మా



మాచారెడ్డి: మండలంలోని లచ్చాపేటలో మంగళవారం పోచమ్మ, పెద్దమ్మ బోనాలను ఊరేగించారు. ముదిరాజులు ఇంటికో బోనం చొప్పున అలంకరించి అమ్మ వారికి సమర్పించారు. ఈసారి వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని పెద్దమ్మ తల్లిని వేడుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించే వరకు సమ్మె

భిక్కనూరు: ఇచ్చిన హమీ మేరకు విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగ భద్రత కల్పించేవరకు సమ్మెను కొనసాగిస్తామని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట ఉపాధ్యాక్షుడు నారాయణగుప్తా అన్నారు. మంగళవారం తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాల్లో 1100 మంది కాంట్రాక్టు అధ్యాపకులు ఉన్నారని వీరందరికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హమీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, సునిత, నరసయ్య,రమాదేవి, నిరంజన్, వైశాలి, సరిత, శ్రీకాంత్, దిలీప్‌లు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER
■ITR/Salary Slip లేకుండా 48గంటల్లో హోంలోన్ పొందడం కష్టం కాదు– Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి:7406393937.
[HA-453]

MISSING
■సుంకరి సాయిలు S/o. సాయిలు R/o. జలాల్‌పూర్, వర్ని, Nzb. 18/04/25 నాడు జలాల్‌పూర్ నుండి వర్ని బస్సులో వస్తుండగా (Hall ticket: 1118372899) నం గల ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ పోయినది. దొరికినవారు సంప్ర: 9908376133.
[SCA25002919]

WANTED
■Teachers to teach all Subjects from Nursery to X - Std E/M only Little Hearts High School, Namdevwada, Nzb. Cont: 9490650782, 8309582476.
[SCA25002844]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/- రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలిం చిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఒకరికి ఐదురోజుల జైలు

ఎడపల్లి(బోధన్): మండలం కేంద్రంలో ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా అంబం(వై)గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని పోలీసులు మంగళవారం కోర్టులో హాజరు పరచగా ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు.

సమయపాలన పాటించని వ్యాపారికి..

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌లో షేక్ మాజీద్ తన దుకాణంను రాత్రివేళ సమయపాలన పాటించకుండా నడపడంతో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ కేసు నమోదు చేశారు. దీంతో షేక్ మాజీద్‌ను మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తు తీర్పును వెల్లడించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని యోగేశ్వర కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా.. కాలనీకి చెందిన తోగటి భుమేశ్వర్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి మామిడిపల్లిలోని వృద్ధాశ్రమానికి వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి తాళం ధ్వంసం చేసిఉండటంతో పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దుండగులు బీరువాలోని 5తులాల బంగారం, 80గ్రాముల వెండిని దొంగిలించినట్లు తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

కులాస్‌పూర్ తండా, బాడ్సిలో అగ్నిప్రమాదం



మోపాల్: మండలంలోని కులాస్‌పూర్ తండా, బాడ్సి గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్న సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. కులాస్‌పూర్ తండాలో బంతిలాల్‌కు చెందిన గడ్డివాముకు మంటలు అంటుకుని పెళ్లి కోసం కొనుగోలు చేసిన కలప దగ్ధమైంది. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారమివ్వగా, నిజామాబాద్ నుంచి వచ్చిన సిబ్బంది మంటలార్పేశారు. ప్రమాదంలో సుమారు రూ.40వేల వరకు నష్టం జరిగినట్లు బంతిలాల్ పేర్కొన్నాడు. అలాగే బాడ్సిలో కోసిన వరి గడ్డికి నిప్పంటుకుంది. డయల్ 100కు గ్రామస్తులు ఫోన్ చేయడంతో ఎస్ఐ యాదగిరి గౌడ్, సిబ్బందితో అక్కడికి వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తుండగా, ఇందల్వాయి నుంచి వచ్చిన ఫైరింజన్ మంటలను అదుపులోకి తెచ్చింది. బదావత్ చత్రు గడ్డి, కె శ్రీనివాస్ పైపులు ప్రమాదంలో కాలిబూడిదయ్యాయి.

సిర్నాపల్లి అడవుల్లో ఇసన్నపల్లి వాసి హత్య?

రామారెడ్డి: కామారెడ్డి మండలంలోని ఇసన్నపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని సిర్నాపల్లి అడవులలో ఏడు నెలల క్రితం హత్య చేసినట్లుగా విశ్వసనీయ సమాచారం. హత్యకు కారకులైన ఇద్దరు వ్యక్తులతో పాటు మృతుడి భార్యను రామారెడ్డి పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. హత్య ఘటనలో ఆరు నుంచి ఎనిమిది మంది పాల్గొన్నట్లు ప్రచారం జరుగుతోంది. మృతుడు గల్ఫ్‌కు వెళ్లినట్లుగా మృతుడి భార్య బంధువులను నమ్మించింది. మృతుడి అన్నకు అనుమానం రావడంతో రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశాడు. తన తమ్ముడు గల్ఫ్ దేశం వెళ్లలేదని, తమ్ముడి భార్య వివాహేతర సంబంధం పెట్టుకొని ప్రియుడితో కలిసి అతడిని హత్య చేయించిందని ఫిర్యాదు చేశాడు.మృతుడు గల్ఫ్ దేశం వెళ్లినట్లు ఇమిగ్రేషన్ లేదనే సమాచారం పోలీసులు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసుపై ఎస్పీ నేరుగా రంగంలోకి దిగడంతో హత్య ఘటన కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది.

జల్సాల కోసం చోరీలు

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- 9 కేసుల్లో నిందితుడితో పాటు మరో ఐదుగురు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ చైతన్యరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్య రెడ్డి

కామారెడ్డి క్రైం: జల్సాలకు అలవాటు పడి తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని దేవునిపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కామారెడ్డి సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి వివరాలు వెల్లడించారు. పది రోజుల క్రితం పట్టణ శివారు కాలనీలో ఓ దొంగతనం జరిగింది. పోలీసులు విచారణ చేపట్టగా మాసాయిపేట్‌కు చెందిన పందిగోటి రామును నిందితుడిగా గుర్తించారు. అతడిని తూప్రాన్ ప్రాంతంలో మంగళవారం పట్టుకుని విచారించగా దేవునిపల్లితోపాటు నిజామాబాద్, బోధన్, మేడ్చల్, మనోహరాబాద్ పీఎస్‌ల పరిధిలో మొత్తం 9 చోట్ల చోరీలకు పాల్పడినట్లు తేలింది. దీంతో అతడికి సహకరించిన బంధాపురం మల్లేష్, వడ్డెర నవీన్, శ్యాంలాల్, రినివర్ రాజారాం, మునివర్ గౌతంలను సైతం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని ఏఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి 6 తులాల బంగారం, అర కిలో వెండి ఆభరణాలు రికవరీ చేశామన్నారు.

కుక్కల దాడిలో పసి బాలుడికి గాయాలు


ఆర్మూర్‌లో కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 11వ వార్డులో మంగళవారం ఉదయం శ్రేయన్స్ అనే బాలుడిపై కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి కుక్కను తరిమేసి, గాయపడ్డ బాలుడిని చికిత్స నిమిత్తం ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మద్నూర్‌లో లేగదూడలకు..

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ గోశాలలోని రెండు లేగదూడలపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. గోశాలలోకి మంగళవారం ఉదయం కుక్కల గుంపు ప్రవేశించి లేగదూడలపై దాడి చేశాయన్నారు. దీంతో లేగదూడలకు తీవ్ర రక్తస్రావం జరిగిందన్నారు. మరో రెండు లేగదూడలు పారిపోయాయని వాటి కోసం వెతుకుతున్నామని గోశాల నిర్వాహకులు తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి


రమేష్ మృతదేహం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామ శివారులోని గుండ్ల చెరువులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఇందల్వాయి మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన రమేష్(35) బతుకుతెరువు కోసం అంకాపూర్‌కు వచ్చి, పనిచేస్తున్నాడు. కాగ మంగళవారం బర్రెలను మేపుతుండగా చెరువులో పడిన బర్రెను కాపాడే ప్రయత్నంలో రమేష్ నీటిలోకి దిగాడు. చెరువులోని చేపల వల అతడికి తట్టుకోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడి భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..


రాకేష్ మృతదేహం

వర్ని: మండల కేంద్రంలోని వీక్లీ మార్కెట్లో సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ఆర్య రాకేష్ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియ రాలేదని, విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కమలాపూర్‌లో యువకుడి ఆత్మహత్య

డిచ్‌పల్లి: మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన కర్రెనోళ్ల రంజిత్ (28) ఆత్మహత్య చేసుకున్నట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. రంజిత్ తల్లి భూలక్ష్మి గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. తల్లికి వ్యాధి తగ్గకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన రంజిత్ సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. తల్లి భూలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో మంగళవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. వివరాలు ఇలా.. గ్రామంలోని బైపాస్ రోడ్డులోగల శంబుని గుడి నిర్మాణ విషయంలో తగాదా నెలకొంది. శంబుని గుడి నిర్మాణం కోసం ఒక వర్గం వారు ప్రయత్నం చేయగా మరో వర్గం వారు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి దాడులకు పాల్పడ్డారు. ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆర్మూర్ టౌన్: మహిళను హత్య చేసిన కేసులో మామిడిపల్లికి చెందిన దండుగల తిర్మల్ అనే వ్యక్తికి నిజామాబాద్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ మంగళవారం జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్య నారాయణ గౌడ్ తెలిపారు. తిర్మల్ 2007లో పొరుగింట్లో ఉంటున్న చంద్రకళను గొడ్డలితో దాడి చేసి హతమార్చాడు. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి నిందితుడి కోర్టులో ప్రవేశ పెట్టారు. విచారణ అనంతరం న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవ నగర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్(44) ఇటీవల ఆత్మహత్యకు యత్నించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రూరల్ రెండవ ఎస్సై ఆనంద్ సాగర్ తెలిపారు. శ్రీనివాస్ మద్యానికి బానిసై ఈనెల 16న గడ్డిమందు తాగి, కుటుంబసభ్యులకు తెలిపాడు. వెంటనే వారు అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాస్ మంగళవారం మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

ఇద్దరు నిందితుల అరెస్టు

నవీపేట: మహిళ మెడలోంచి బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. ఎడపల్లి మండలంలోని ఏఆర్‌పీ క్యాంపునకు చెందిన ఇద్దరు నిందితులు సాయికుమార్, పవన్‌కళ్యాణ్ ఈనెల 18న బైక్‌పై వచ్చి ధర్మారం శివారులో చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితులను అరెస్టు చేసి బైక్, పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.